

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | గురువారం | నవంబర్ 30, 2023 | www.navatelangana.com

ఓటేద్దాం..పదండి..!





ప్రజాస్వామ్యంలో వజ్రాయుధంలా భావించే ఓటు హక్కును వినియోగించుకునే సమయం ఆసన్నమైంది. గురువారం ఉదయం 7గంటలకే ప్రారంభమయ్యే ఈ ఓట్ల పండగలో అందరూ పాల్గొనాల్సిన అవసరం ఉంది. పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి సుమారు నెల రోజులుగా నెలకొన్న హడావుడి ప్రచారం హడావుడి ముగిసిపోగా.. ఓటు వినియోగంతో రెండో దశ కూడా పూర్తికానుంది. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడికావడంతో తుది దశ ముగియనుంది. పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటికే పోలింగ్ సమాగ్రిని ఆయా కేంద్రాలకు పంపించింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం బందోబస్తు ఏర్పాటుచేసింది. విజయం కోసం అహర్నిషలు శ్రమించిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలతో నిక్షిప్తం కానుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

- నేటి ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం
- ఐదు నియోజకవర్గాల్లో సాయంత్రం 4గంటలకే ముగింపు
- బరిలో 148మంది అభ్యర్థులు..22,64,475మంది ఓటర్లు
- పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- ఈవీఎంలలో నిక్షిప్తం కానున్న అభ్యర్థుల భవితవ్యం

వివరాలు..2లో...


ఆగండి..!

ఒక్క క్షణం ఆలోచించండి..!!

- నాకెందుకని బద్ధకం ప్రదర్శించొద్దు
- మంచి వారికే ఓటేయాలి

నేడు సుదినం. ప్రజాస్వామ్యానికి పట్టం గట్టే పర్వదినం. ఈ రోజు అసెంబ్లీ ఎన్నికలు జరగుతున్న సంగతి తెలిసిందే. ఎంత బిజీగా ఉన్నా ఓటు హక్కును వినియోగించుకోవాలి. 'ఏం..నేనొక్కడినే ఓటేయకపోతే ఎన్నికలు ఆగిపోతాయా? గెలిచే వారు గెలవరా? అంటూ బద్ధకం ప్రదర్శించొద్దు. ఒక్క క్షణం...కుటుంబ పెద్దగా మీరు మీ బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. కుటంబంలోని ప్రతి సభ్యుని అవసరం తెలుసుకుంటూ వారి అసవరాలను తీరుస్తున్నారు. వారి మధ్య తగాదాలు రాకుండా ఎంతో ఓర్పుతో, నేర్పుతో వ్యవహరిస్తున్నారు. 'జనని జన్మ భూమిశ్చ...స్వర్గాదపి గరియసి...' అన్నాడో ప్రముఖ కవి. జన్మనిచ్చిన తల్లికన్నా ఉంటున్న దేశం గొప్పదని దీని భావం. మరి ఇలాంటి దేశాన్ని మనం ఎలా చూసుకోవాలి. మంచి నాయకులైతే దేశం అన్ని రంగాల్లో సర్వతోముఖావృద్ధి చెందుతుంది. వనరులన్నీ వినియోగంలోకి వస్తాయి. తద్వారా నిరుద్యోగం, పేదరికం, ఆకలి చావులు లాంటివి అరికట్టొచ్చు. ఇది ఓ వైపు ఆలోచన మాత్రమే. కాని నేడు జరుగుతోందేంటి? పేదలు నేటికీ పేదలుగానే ఉన్నారు. అవినీతి తన విశ్వరూపాన్ని చూపెడుతోంది. పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతబడుతున్నాయి. వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకొని రైతులు బలవంతంగా ఉసురు తీసుకుంటున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎండమావిగా మారాయి. కులాలు, మతాల పేరిట రెచ్చగొట్టి లబ్ధిపొందడానికి యత్నిస్తున్నారు. అణగారిని కులాలపై దౌర్జన్యాలకు, మహిళలపై ఆకృత్యాలకు అంతే లేకుండా ఉంది. చిన్నారులనూ కామంతో చూసే విష సంస్కృతి పెచ్చరిల్లుతోంది. గతంలో మనం ఎన్నుకున్న ప్రభుత్వమే అధికారంలో ఉన్నా వాటిని ఎందుకు అరికట్టలేకపోతోంది? ఈ పరిస్థితి ఇంకా ఇలా కొనసాగాల్సిందేనా? ఇది ఇలాగే కొనసాగుతుంటే రేపు మన దేశ భవిష్యత్తేమిటి? అధికారం కోసం నాయకులు మనల్ని ఎన్నో ప్రలోభాలకు గురి చేస్తారు. ఓటుకు నోటు ఇస్తారు. తాగినంత పోస్తారు. వారం పది రోజులు స్వర్గం చూపిస్తారు. తర్వాత? మన గతేంటి? ఐదేళ్లు మనల్ని ఎవరు పట్టించుకుంటారు? ధరలు పెరిగినా, కనీస సౌకర్యాలు లేకున్నా మీ చావు మీరు చావండని కనీసం ముఖం కూడా చూపరు. మరి నాలుగైదు రోజులు ఆనందించి ఐదేళ్లు బాధపడతారా? అందుకే ఒక్క క్షణం ఆలోచించి నిస్వార్థంగా సేవ చేసే అభ్యర్థిని ఎన్నుకోవడానికి అమూల్యమైన ఓటును ఉపయోగించుకోవాలి. మనది ప్రజాస్వామ్య దేశం. భారత రాజ్యాంగం ద్వారా 18 సంవత్సరాల దాటిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉంది. ఎవరిని నాయకులుగా ఎన్నుకోవాలో నిర్ణయం తీసుకునే హక్కు మనకుంది. ఇన్ని సంవత్సరాలుగా మనం అనేక సార్లు ఓటు వేసి ఎలాంటి నాయకులను ఎన్నుకున్నాం? ఒక్కసారి ఆలోచించండి. మన ఓటుతో గెలిచిన నాయకులు ఒక్కరోజైనా మీ దగ్గరకు వచ్చి సమస్యలు అడిగారా? ఒక వేళ వచ్చినా మీరు విన్నవించినా సమస్యలు అమలుకు నోచుకున్నాయా? వాటి పరిష్కారం కోసం మనం వేసుకున్న చెప్పులు అరిగిపోతున్నాయేగాని...కనీసం మన నాయకుల జాడ కనిపించదు. ఇలా ప్రతిసారి మోసపోతున్నాం. హామీలు, మాటల గారడీలతో మోసం చేయడం పాలకులకు అలవాటైంది. ఈ సారి కూడా మనం ఇలాంటి వారినే ఎన్నుకుంటే మరో ఐదు సంవత్సరాలు బాధపడాల్సిందే. ప్రజా సమస్యలు పట్టించుకోని నాయకుల అడ్రస్‌లను మన ఓటు ద్వారా గల్లంతు చేద్దాం.

నవతెలంగాణ-ఆదిలాబాద్‌డెస్క్





మంచిర్యాలలో పోటాపోటీ..!

- ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు
- మరో విజయం కోసం బీఆర్ఎస్ ప్రయత్నం
- పాగా వేసేందుకు కాంగ్రెస్..ఓట్ల వేటలో బీజేపీ

వివరాలు..2లో...

మంచిర్యాల నియోజకవర్గ రాజకీయం ఆసక్తికరంగా మారింది. ప్రధాన పార్టీల మధ్య నువ్వా-నేనా అనే రీతిలో సమరం సాగుతోంది. మరోసారి విజయం సాధించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తుండగా.. ఇక్కడ పాగా వేయాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. ఓట్ల వేట కోసం బీజేపీ ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తి రేకెత్తిస్తోంది. బీఆర్ఎస్ నుంచి వరుసగా రెండు సార్లు గెలిచిన దివాకర్‌రావు మరోసారి పోటీకి సిద్ధమయ్యారు. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కిందటి ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లోనూ బరిలోకి నిలిచిన ఆయన కచ్చితంగా గెలవాలనే పట్టుదలతో ఉన్నారు. ఇక బీజేపీ నుంచి బరిలో ఉన్న రఘునాథ్‌రావు సైతం ఇటీవల పుంజుకోవడంతో గణనీయమైన ఓట్లను సాధించే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీరితో పాటు మిగితా 14మంది స్వతంత్రులు, రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల అభ్యర్థలు బరిలో ఉండటంతో పోటీ రసవత్తరంగా మారుతోంది.

బెల్లంపల్లిలో నువ్వా-నేనా..?

- రెండు ప్రధాన పార్టీల హోరాహోరీ పోరు
- హ్యాట్రిక్ కోసం గులాబీ.. గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్
- నియోజకవర్గంలో రసవత్తరంగా మారిన సమరం

తూర్పు జిల్లాలో బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎన్నికల సమరం రసవత్తరంగా మారింది. సింగరేణి కార్మికులు అధికంగా ఉండే ఈ నియోజకవర్గంలో ఎన్నికల క్రతువు కీలక ఘట్టానికి చేరుకుంది. ఈ నియోజకవర్గంలో విజయం సాధించాలని ప్రధాన పార్టీలు గట్టి పట్టుదలతో ఉన్నాయి. తెలంగాణ ఆవిర్భావం నుంచి వరుసగా రెండు సార్లు విజయం సాధించిన బీఆర్ఎస్ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని భావించగా.. ఇక్కడ పాగా వేసేందుకు కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ప్రచారంలో భాగంగా ఆయా పార్టీల అగ్రనేతలు వచ్చి ప్రచారం నిర్వహించడంతో హోరాహోరీ పోరు తప్పేలా కనిపించడం లేదు. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మరోసారి బరిలో నిలవగా.. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి గడ్డం వినోద్ పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఏ. శ్రీదేవీ బరిలో నిలిచారు. వీరితో పాటు స్వతంత్రులు, రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల నుంచి పదిమంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ఎవరు విజయం సాధిస్తారోననే ఉత్కంఠ రేపుతోంది.

వివరాలు..2లో...





ఓటేద్దాం..పదండి..!



ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సామాన్యుడి ఆయుధంగా భావించే ఓటుహక్కును వినియోగించే సమయం రానేవచ్చింది. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇప్పటికే అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. వివిధ రూపాల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకొచ్చింది. ఇక ఓటు హక్కును వినియోగించుకునే బాధ్యత జనాలపైనే ఉంది. తాజా ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు 22,64,475మంది ఓటర్లు ఉన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్రులు, రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల నుంచి 148మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా.. పోలింగ్ నిర్వహణ కోసం 2852 కేంద్రాలను ఏర్పాటుచేశారు. పోలింగ్ సిబ్బంది బుధవారమే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. అధికార యంత్రాంగం రూట్ల వారీగా కేటాయించిన బస్సులు, ఇతర వాహనాలు తరలివెళ్లారు. ఇప్పటికే ఓటర్లకు పోల్ చీటీలు కూడా పంపిణీ చేశారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే సమాచారం కోసం కంట్రోల్ రూం నెంబర్లను సైతం ఏర్పాటుచేశారు.

ఐదింటిలో 4గంటలకే ముగింపు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రత్యేక పరిస్థితులు ఉంటాయి. ఇక్కడ పది అసెంబ్లీ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగనుంది. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన మరో ఐదు నియోజకవర్గాలైన సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాలలో మాత్రం 7గంటల నుంచి సాయంత్రం 4గంటలకే పోలింగ్ ముగించనున్నారు. ఇక్కడ గంట ముందుగానే పోలింగ్ ముగియనుందని అధికారులు చెబుతున్నారు.

ఈవీఎంలలో నిక్షిప్తం..!

ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించేందుకు ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు సైతం ముమ్మర ప్రచారం నిర్వహించారు. విజయమే లక్ష్యంగా తీవ్రంగా శ్రమించారు. సుమారు నెల రోజుల పాటు ఉదయం నుంచి రాత్రి వరకు పల్లెలు, పట్టణాలు తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. రెండు రోజుల క్రితం ప్రచారం ముగియడంతో ఊపిరి పీల్చుకున్నప్పటికీ..ఓటర్లు చివరకు ఎవరిని కరుణిస్తారో అనే ఆందోళనకు గురవుతున్నారు. తుది నిర్ణయం ఓటర్లకే వదిలేశారు. తాజాగా గురువారం పోలింగ్ జరగడంతో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. డిసెంబర్ 3వ తేదీన ఫలితాలు వెలువడటంతో అప్పటి వరకు అభ్యర్థుల్లో ఆందోళన కనిపించే అవకాశం ఉంది.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు ఇవి

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	అభ్యర్థులు	ఓటర్లు
సిర్పూర్	293	13	227164
చెన్నూర్	227	14	188417
బెల్లంపల్లి	227	13	173498
మంచిర్యాల	287	17	275141
ఆసిఫాబాద్	304	17	226778
ఖానాపూర్	305	11	220942
ఆదిలాబాద్	290	25	240559
బోథ్	302	10	208599
నిర్మల్	306	13	253551
ముధోల్	311	14	249826



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మంచిర్యాలలో పోటాపోటీ..!



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తూర్పు జిల్లాలో కీలకమైన మంచిర్యాల నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. సింగరేణి ప్రాంతంగా పేరుగాంచిన ఈ నియోజకవర్గంలో గెలిచేందుకు ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. తెలంగాణ ఆవిర్భావం నుంచి రెండుసార్లు వరుస విజయం సాధించిన బీఆర్ఎస్ మూడో విజయం కోసం ఉవ్విళ్లూరుతోంది. ఇక పదేండ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ తాజా ఎన్నికల్లో కచ్చితంగా గెలవాలనే పట్టుదలతో ఉంది. ఇక బీజేపీ సైతం ఈ నియోజకవర్గంలో పాగా వేయాలని భావిస్తోంది. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ నెలకొనగా.. బీజేపీ సైతం ప్రభావం చూపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. వీరితో పాటు పలువురు స్వతంత్రులు సైతం ఓట్లు సాధించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో 2,75,141 మంది ఓటర్లు ఉండగా 136760 మంది పురుషులు, 138022 మంది మహిళలు, 25మంది ఇతరులు, 334మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

గెలిచేదెవరో..?

మంచిర్యాల నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల సమరంపై అందరి చూపు కేంద్రీకృతమైంది. ఇక్కడ చోటుచేసుకుంటున్న రాజకీయాలు హాట్‌టాఫిక్ అవుతున్నాయి. విజయావకాశాలపై జోరుగా చర్చోపచర్చలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న దివాకర్‌రావు మరో విజయం కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు సుదీర్ఘ రాజకీయ అనుభవం, అవినీతిరహితుడిగా పేరు ఉండటం విజయానికి సానుకూలంగా మారగా.. తొమ్మిదేండ్లలో అంతగా అభివృద్ధి లేదనే అపవాదు, కింది స్థాయి క్యాడర్ లేకపోవడం వంటి అంశాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న ప్రేమ్‌సాగర్‌రావు గెలుపుపై నమ్మకం పెట్టుకున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించడం, కరోనా సమయంలో రోగులు, బంధువులకు సుమారు 45రోజుల పాటు భోజన సదుపాయం కల్పించడం, వేసవిలో తాగునీరు సరఫరా చేయడంతో పాటు కాంగ్రెస్ గాలివీయడం వంటి అంశాలు విజయానికి సానుకూలంగా మారగా తాజాగా బీజేపీ పుంజుకోవడంతో ఓట్ల చీలిక ప్రభావం ఉండటం ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక బీజేపీ నుంచి బరిలో నిలిచిన రఘునాథ్‌రావు సైతం గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ పట్ల ప్రజలను ఆకర్షితులను చేశారు. మోడీ చరిష్మా వంటి అంశాలు విజయానికి దోహదపడుతాయని భావిస్తుండగా.. నియోజకవర్గంలో బీజేపీకి అంతగా బలం లేకపోవడం, బలమైన అభ్యర్థులు బరిలో ఉండటం అంశాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందులో ఎవరు విజయం సాధిస్తారోననే విషయం డిసెంబర్ 3న వెల్లడికానుంది.

బెల్లంపల్లిలో నువ్వా-నేనా..?



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సింగరేణి క్షేత్రంగా పిలువబడే బెల్లంపల్లి నియోజకవర్గంలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కార్మికులు అధికంగా ఉండే ఈ స్థానంలో వారి ఓట్లను పొందేందుకు ప్రధాన పార్టీలు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక్కడ తెలంగాణ ఆవిర్భావానికి ముందు సీపీఐ ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానంలో రాష్ట్ర ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ ఈ స్థానాన్ని ఆక్రమించింది. వరుసగా రెండు సార్లు విజయం సాధించి మూడో విజయం కోసం సిద్ధమవుతోంది. ఇంక 2009లో పొత్తులో భాగంగా సీపీఐకి వదిలేసిన ఈ స్థానంలో తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ బరిలో నిలిచింది. ఇక్కడ విజయం సాధించి పాగా వేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇక బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవీ పోటీలో నిలిచారు. ఈమె గణనీయమైన ఓట్లు సాధించే అవకాశం ఉన్నా.. ప్రధానంగా ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే గట్టి పోటీ నెలకొందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గమైన ఇక్కడ 1,73,493మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 86,574మంది ఉండగా మహిళలు 86,749మంది, ఇతరులు 12మంది ఉన్నారు. వీరితో పాటు సర్వీసు ఓటర్లు 156మంది నమోదు చేసుకున్నారు. తాజా ఎన్నికల కోసం 25మంది నామినేషన్లు వేయగా తొమ్మిదింటిని అధికారులు తిరస్కరించారు. ముగ్గురు అభ్యర్థులు ఉపసంహరించుకోగా.. 13మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

విజయం దక్కేదెవరికీ..?

ఈ నియోజకవర్గంలో చోటుచేసుకున్న రసవత్తర పోరులో విజయం ఎవరిని వరిస్తుందోననే ఉత్కంఠ రేపుతోంది. బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన దుర్గం చిన్నయ్య మరో విజయం కోసం తాపత్రయ పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తన సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండటం, చేపట్టిన అభివృద్ధి పనులు విజయానికి సానుకూలంగా మారగా.. ఓ మహిళ ఆరోపణలు, అహంకార ధోరణి వంటి అంశాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన గడ్డం వినోద్ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. మాజీ మంత్రిగా పనిచేసిన అనుభవం.. ఆయన కుటుంబానికి మంచి పేరుతో పాటు కాంగ్రెస్ గాలి వీయడం వంటి అంశాలు సానుకూలంగా మారగా.. స్థానికంగా ఉండరనే అపవాదు ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీజేపీ నుంచి బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి విజయం కోసం తీవ్రంగా శ్రమించారు. మాజీ ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో పాటు మోడీ ఛరిష్మా గట్టెక్కిస్తుందని భావించగా.. బీజేపీకి నియోజకవర్గంలో అంతగా బలం లేకపోవడం.. అసమ్మతివర్గం సహకరించకపోవడం అంశాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీరితో పాటు బరిలో ఉన్న పలువురు స్వతంత్రులు సైతం ఎన్నికల్లో సత్తా చాటే అవకాశం కనిపిస్తోంది. ఇందులో విజేతలెవరో..పరాజితులెవరో అనేది డిసెంబర్ 3న తేలిపోనుంది.



నవతెలంగాణ
నిర్మల్
గురువారం నవంబర్ 30, 2023

ఆదిలాబాద్‌లో మహారాష్ట్ర పోలీసుల బందోబస్తు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాకు మహారాష్ట్ర పోలీసులు బందోబస్తు నిమిత్తం వచ్చారు. దాదాపు 550 మంది హోంగార్డులు జిల్లాలో విధులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. వారికి ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో విధులు కేటాయించారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ కేంద్రంలో సిబ్బందికి పలు జిల్లా ఎస్పీ సూచనలు చేశారు.

పోలింగ్ బూత్‌లకు తరలిన ఈవీఎంలు



నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని 302 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను బుధవారం తరలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఛాహత్ బజ్‌పాయి ఐదు పోలింగ్ స్టేషన్లకు ఒక సెక్ట్రాల్ అధికారిని నియమించి 95 వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 34 సెక్టర్ అధికారి నియమించి 50 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నరు. నియోజకవర్గంలోని 50 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి సౌకర్యాలు కల్పించామన్నారు. 300 మంది పోలీస్, 1200 మంది అధికారులను నియమించామని తెలిపారు.

ఎన్నికల బందోబస్తుకు 800 మంది పోలీసులు



నవతెలంగాణ-ముధోల్

అసెంబ్లీ ఎన్నికల్లో నేపథ్యంలో ముధోల్ నియోజకవర్గ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు బైంసా ఆడిషినల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆద్వర్యంలో బందోబస్తు చేపడుతున్నారు. నియోజకవర్గంలో 311 పోలింగ్ కేంద్రాల్లో 88 సమస్యాత్మక కేంద్రాలను పోలీసులు గుర్తించారు. ఇక్కడ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసేల చర్యలు మొదలు పెట్టారు. బందోబస్తులో కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది, సీఐ, ఎస్సైలతో పాటు మొత్తం 800 మందిని నియామించినట్టు ఏఎస్పీ కాంతిలాల్ తెలిపారు. ప్రలోభాలకు గురి చేసినట్టు ప్రజల దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 లేదా సివిజల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నార్నూర్, గాదిగూడలో 51 పోలింగ్ కేంద్రాలు



నవతెలంగాణ-నార్నూర్

అసెంబ్లీ ఎన్నికల కోసం నార్నూర్, గాదిగూడ మండలంలో 51 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి మండలంలో మొత్తం 38,802 ఓటర్లు ఉండగా నార్నూర్‌లో 29, గాదిగూడలో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎన్నికలను సజావుగా నిర్వహించేల అధికారులు ఏర్పాట్లు చేశారు. నార్నూర్ మండలంలో 29 పోలింగ్ కేంద్రాల్లో 22,984 మంది ఓటర్లు, గాదిగూడ మండలంలో 22 పోలింగ్ కేంద్రాల్లో 15,818 మంది ఓటర్లు ఉన్నారు. అదే విధంగా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు బలగాలు చేరుకున్నాయి. సీఆర్పీఎఫ్ సహాయక బలగాలతో సీఐ ప్రేమ్ కుమార్, ఎస్సై రవికిరణ్ కావతు నిర్వహించారు.

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి అయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మూడు నియోజకవర్గాలు నిర్మల్, ముధోల్, ఖానాపూర్‌లకు అధికారులు పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం వారిని ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. నిర్మల్ నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 1,468 పోలింగ్ అధికార సిబ్బంది, ముధోల్ నియోజకవర్గంలో 311 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 1,496, ఖానాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 604 మంది పోలింగ్ అధికార సిబ్బందిని కేటాయించారు. వాహనాల్లో వారికి కేటాయించిన కేంద్రాలకు తరలి వెళ్లారు. ఈ పోలింగ్ కేంద్రాల తరలింపు ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మూడు నియోజకవర్గ పరిధిలో 922 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందులో 153 సమాసాత్మకంగా ఉన్నవని, 17 మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, 10 పోలింగ్ కేంద్రాలు సెల్ సిగ్నల్స్ లేనివి ఉన్నాయని తెలిపారు. పోలింగును పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోస్తులు నిర్వహించినట్లు వెల్లడించారు.



పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్తున్న సిబ్బంది

ముధోల్‌లో ఎన్నికలకు సర్వం సిద్ధం



ఎన్నికల సామాగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గ పరిధిలో గురువారం నిర్వహించే ఎన్నికల కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రణాళిక బద్ధమైన చర్యలతో పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. బుధవారం సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల ఆవరణలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ నిర్వహణ సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో 31 కౌంటర్లను ఏర్పాటు చేశారు. సెక్టార్ అధికారులు రూట్ల వారీగా ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేరవేశారు. 311 పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేశారు. 1496 ఎన్నికల సిబ్బంది నినియమించారు. ఇందులో 31మంది సెక్టోరియాల్, 31మంది రూటు అధికారులు, 374 మంది ప్రెసిడింగ్, 374 మంది అసిస్టెంట్ ప్రెసిడింగ్, 748 మంది ఆదనపు పోలింగ్ అధికారులు, 150మంది విడియో గ్రాఫర్ లు, 40 మంది మైక్రో అబ్జార్వర్లు, 700 మంది పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నారు. 31 రూట్లు విభజించి ఒక్కో రూట్‌కు ఒక్కో సేక్టర్ ఆఫీసర్‌ను నియమించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ప్రెసిడింగ్, అసిస్టెంట్ ప్రెసిడింగ్ అధికారి, ఇద్దరూ అదనపు పోలింగ్ సిబ్బంది, ఒక వేబ్‌కస్టర్ విధులు నిర్వహించనున్నారు. ఎన్నికలకు మొత్తం 311 ఓటింగ్ యంత్రాలను వినియోగించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోమల్ రెడ్డి తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారి అతికొద్దిన్‌తో కలిసి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది, పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల సామాగ్రి అందించి రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించారు. ఈవీఎంలను తరలించేందుకు సుమారు 89 బస్సులను ఏర్పాటు చేశారు. ఎన్నికల జిల్లా అధికారి ఆశిష్ సంగ్వాన్ ముధోల్‌లో పర్యటించారు. డిస్ట్రిబ్యూటర్ కేంద్రంలో ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు వ్యవస్థను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు.



భారీ మొత్తంలో నగదు పట్టివేత



నవతెలంగాణ - సిర్పూర్(టి)

పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.56.48లక్షలు పట్టుకున్నట్టు ఫ్లయింగ్‌స్క్వాడ్ ఫీల్డ్ ఆఫీసర్ రఘునాథరావు, దీకొండ రమేష్ తెలిపారు. వారి వివరాల ప్రకారం..సిర్పూర్ నుండి కాగజ్‌నగర్‌కు ఆటోలో డ్రైవర్ షఫిల్లాఖాన్ నగదు తరలిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా సిర్పూర్ గ్రామానికి చెందిన తంగడిపెల్లి సంతోష్, ముసవీర్ తన ఆటోలో సన్‌ఫ్లవర్ నూనె డబ్బాలు వెనుక భాగంలో నగదు ఉంచారని తెలిపాడు. డబ్బాలను సిర్పూర్‌లో తీసుకుంటామని తెలపడంతో తీసుకొచ్చినట్టు తెలిపాడు. ఇద్దరిని పిలిపించి విచారించగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. పట్టుబడిన నగదును సీజ్ చేసి తదుపరి విచారణ చేపడుతున్నామని పోలీసులు పేర్కొన్నారు.

డిసెంబర్ 2న జోనల్ స్థాయి బాలుర క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 2న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రదర్శిని స్టేడియంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-17 బాలుర విభాగం జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కాంతారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు తమ సొంత ప్లేయింగ్ కిట్లతో పాటు నాలుగు సెట్ల ఎలిజిబిలిటీ ఫారాలు పూర్తిచేసుకుని తీసుకురావాలని సూచించారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు సకాలంలో చేరుకోవాలని కోరారు. ఉదయం 9 గంటలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కన్వీనర్ పార్థసారథికి రిపోర్టు చేయాలని సూచించారు.

మద్యం, చీరలను పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్



నవతెలంగాణ-నస్పూర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా నిలువ ఉంచిన మద్యం, చీరలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం బుధవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని ఒకరి ఇంటి వద్ద 15, మరొకరిది వద్ద 41 క్వార్టర్ సీసాలను, అలాగే ఒకరింటి వద్ద 110 చీరలు, సీసీసీ కార్నర్ ఎస్బీఐ బ్యాంకు ఎదుట బైకులపై తరలిస్తున్న 197 చీరలను పట్టుకున్నట్టు తెలిపారు. వీటన్నింటినీ సీజ్ చేసి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ఎన్నికలకు భారీ బందోబస్తు

నవతెలంగాణ-నిర్మల్

నేడు జరగబోవు ఎన్నికలకు భారీ బందోబస్తును ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీర్ మినీస్టేడియం, సోన్‌లోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ నియోజకవర్గాల్లో 519 పోలింగ్ లొకేషన్లు, మొత్తం పోలింగ్ బూత్‌లు 743 ఏర్పాటు చేశామని తెలిపారు. వీటిలో సాధారణ, సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలుగా విభజించామని, దానికి అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో జరిగే ఎన్నికల్లో ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యేకమైన యాక్షన్ ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ మూడంచెల భద్రత వ్యవస్థ రూపొందించామని, దీనిలో భాగంగా జిల్లా స్పెషల్ పార్టీ, సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌లతో గస్తీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మారుమూల గ్రామాలకు ఈవీఎంల తరలింపులో భాగంగా ఎటువంటి ఆటంకం రాకుండా ఆకస్మిక వాహనాల తనిఖీ, బైక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, టీములుగా విభజించామని, వీటిలో భాగంగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంతో పాటు అనుకోని సంఘటన సంభవిస్తే దాన్ని ప్రతిఘటించేలా క్విక్ రియాక్షన్ టీంను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే ప్రతి ఒక్క టీం తమ తమ స్థానాలలో విధులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలియజేశారు.





ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా

నవతెలంగాణ-జైపూర్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో గల పోలీస్ అధికారులతో పాటు కేంద్ర బలగాలతో ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ రూట్ మొబైల్ అధికారులు, ఆర్మ్‌డ్ అధికారులతో పోలింగ్ అధికారులను, పోలింగ్ పరికరాలను పోలింగ్ లొకేషన్‌కు పటిష్టమైన భద్రతతో తరిస్తున్నట్లు రామగుండం సీపీ రెమో రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా పరిధిలో 1762 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, 10 కేంద్ర బలగాల కంపెనీలు 650 మంది చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన హోంగార్డ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఒక పోలీస్ టీమ్‌ను పోలింగ్ బందోబస్త్‌కు వినియోగిస్తున్నారు. ఎన్నికల నిర్వాహణకు మానిటరింగ్ చేసేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. పోలీస్ కమీషనరేట్ పరిధిలో 48 గంటల పాటు సైలెన్స్ పిరియడ్‌లో అన్ని లాడ్జీలు, ఫక్షన్‌హాల్స్, గెస్ట్ హౌస్‌లు తనిఖీ చేస్తున్నామన్నారు. అకస్మిక తనిఖీలు, ఓటర్లను ప్రభావితం చేయడం, ప్రజలను ప్రలోబాలకు గురి చేసే డబ్బులు, వస్తువులు పంచకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో నవంబర్ 30 సాయంత్రం 5 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. కాగా ఎన్నికల నిర్వాహణలో భాగంగా మంచిర్యాల జిల్లా పరిధిలో 1989 మందిని బైండోవర్ చేసిన అధికారులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతం పోలింగ్ లొకేషన్లలో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. సరిహద్దు రాష్ట్రాలు ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే ప్రత్యేక నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి నిబంధనలు ఉల్లంఘించిన ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించినా, అల్లర్లు, గొడవలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా సీపీ హెచ్చరించారు.





నేటి పోలింగ్‌కు అంతా సిద్ధం..!

- హాజీపూర్ మండలంలో 32 పోలింగ్ కేంద్రాలు
- మండలంలో 42,082 మంది ఓటర్లు

నవతెలంగాణ-హాజీపూర్

నేడు జరగనున్న శాసనసభ ఎన్నికలకు మండలంలోని పోలింగ్ కేంద్రాలను అధికారులు పూర్తి సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 42,082 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 20,472 మంది పురుషులు, 21,608 మహిళా ఓటర్లతో పాటు ఇతర ఓటర్లు ఒక్కరు మాత్రమే ఉన్నారు. మండలం 17 గ్రామ పంచాయితీలు ఉండగా పోలింగ్ స్టేషన్ 97 నుంచి 128 వరస సంఖ్య వరకు ఉండగా మొత్తంగా 32 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు, మూడు, నాలుగు పోలింగ్ స్టేషన్లు కలిగి ఉన్న పోలింగ్ లొకేషన్లు 14 ఉన్నాయి. పోలింగ్ లొకేషన్ కేంద్రాల్లో ఎలాంటి ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండలంలోని కర్ణమామిడిలో 3, పడ్తనపల్లి 2, హాజీపూర్ సబ్బెపల్లిలో 2, టీకానపల్లి 1, దొనబండ 3, పెద్దంపేట 2, వేంపల్లి 2, ముల్కల్ల 3, గుడిపేట-నంనూర్ 4, దుబ్బపల్లి 2, రాపల్లి 2, నర్సింగాపూర్ 2, ర్యాలీ, గడ్పూర్, చిన్నగోపాల్పూర్. నాగారంలలో ఒక్కో పోలింగ్ కేంద్రం ఉంది. ఈ 32 పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మంచినీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లకు సంబంధించి పూర్తి వసతులు ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రమే చేరుకుని పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఉదయం 7 గంటల నుంచి 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగనుంది.



ప్రశాంత ఎన్నికలకు సీసీ కెమెరాలు...

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హాజీపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలన్నీ కూడా సీసీ కెమెరాల నిఘా నీడలోకి వచ్చేశాయి. ఇందుకు గాను ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మంచిర్యాల రూరల్ సీఐ తోట సంజీవ్, హాజీపూర్ ఎస్సై నరేశ్ కుమార్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ప్రత్యేక పోలీస్ బలగాలు ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించగా ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనలకు లేకుండా నిరభ్యంతరంగా ఓటు వేయాలని సూచిస్తూ సందేశం అందజేశారు. ఎన్నికల వేళ గ్రామాల్లో మద్యం ఏరులై పారకుండా చర్యలు చేపట్టగా విస్తృతంగా గస్తీ నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాలైన ర్యాలీ, గఢ్పూర్‌లో పోలీసుల బందోబస్తు మరింత కట్టుదిట్టం చేశారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో స్పెషల్ ఫోర్స్ ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

దివ్యాంగులకు ఏర్పాట్లు..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వంద శాతం పోలింగ్‌లో భాగంగా దివ్యాంగుల ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రంలోని ఎలాంటి మానసిక, శారీరక ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయించారు. కేంద్రాల్లో ర్యాంప్‌తో పాటు వీల్ చైర్లను అందుబాటులో ఉంచారు. ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి, పోలింగ్ కేంద్రం నుంచి ఇంటికి వారిని తీసుకువెళ్లేలా పోలింగ్ రోజున ఉచిత ఆటో రవాణా కలిపిస్తున్నారు.

మోడల్ పోలింగ్ స్టేషన్లు...

పోలింగ్‌పై ప్రజలను అవగాహన కల్పించడంతో పాటు ఆకర్షించేల ఎన్నికల కమిషన్ సూచనల మేరకు మండలంలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని ముల్కల్లలో మోడల్ పోలింగ్ స్టేషన్, దొనబండలో మహిళా మోడల్ పోలింగ్ స్టేషన్లను అందంగా ముస్తాబు చేశారు. అరటి, కొబ్బరి చెట్లతో పాటు అందమైన షామియానాలు వేసి రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలికేల తహసీల్దార్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రంలో అంతా కూడా గ్రీన్ మ్యాట్‌లో పాటు టేబుళ్లను క్లాత్ డెకోరేషన్ చేశారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సెయింట్ క్లారెటి విద్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి ఆధ్వర్యంలో ఎన్నికల సామాగ్రి బుధవారం పంపిణి చేశారు. శాసనసభ ఎన్నికల్లో మొత్తం 226874 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 112918, పురుషులు 113945, ఇతరులు 11 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 45 సమస్యాత్మక, 33 మవోయిస్టు ప్రభావిత కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో ఒక పీఓ, ఒక ఏపీఓతో పాటు మరో ఇద్దరు సిబ్బంది ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకై ఒక ఆడిషనల్ ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, పది మంది సీఐలు, ఇరవై మంది ఎస్సైలు, 1200 మంది కానిస్టేబుల్స్, హోంగార్డులను నియమించారు. ఎన్నికల సామాగ్రి, సిబ్బందిని తరలించడానికి 20 ఆర్టీసీ బస్సులు, 40 మిని బస్సులు, 35 టాటాఎస్లు, జీపులు మొత్తం కలిపి 107 వాహనాలు ఏర్పాటు చేసి తరలించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు ఎన్నికల సిబ్బంది ఆయా వాహనాల్లో బయలుదేరారు. ఎన్నికల సామాగ్రి పంపిణి కేంద్రానికి రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు డీకే చౌదరి, రాహుల్ రంజన్, జిల్లా ఎస్పీ కె సురేష్ కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనవకుండ ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ఎన్నికలు తెచ్చిన కష్టాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని డిపో నుండి 75 శాతం బస్సులు ఎన్నికల సిబ్బందిని చేరవేయడానికి కేటాయించడంతో బుధవారం ఇది అవసరాల నిమిత్తం బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికుల బాధలు వర్ణాతీతంగా మారాయి. హైదరాబాద్ నడిచే సూపర్ లగ్జరీ బస్సులు మినహా డిపోలో 79 బస్సులు ఉండగా 57 బస్సులు ఎన్నికల సిబ్బంది కోసం కేటాయించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీనితో 22 బస్సులు మాత్రమే డిపో పరిధిలో నడిచాయి. దీనితో ప్రతిరోజు ప్రయాణం చేసే సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అడప దడప వచ్చిన బస్సులకు జనం ఎగబడి కిక్కిరిసిపోయారు. నేడు కూడా బస్సులు ఇదేవిధంగా నడుస్తాయని అత్యవసరమైతేనే ఆర్టీసీ బస్సు ప్రయాణాలు చేయాలని లేదంటే కొంత ఇబ్బందులు పడాల్సి వస్తుందని అధికారులు తెలుపుతున్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న అధికారులు



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో జిల్లా అధికారులు ఓటు హక్కును వినియోగించుకూన్నారు. అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, డీఆర్డీఓ శేషాద్రి, డీపీఓ వెంకటేశ్వర్లు, డీపీ ఆర్వో సంపత్ కుమార్‌లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినిగించుకున్నారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. రేపు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, 100 శాతం పోలింగ్ కు కృషిచేస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

నేడు జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ప్రభుత్వ అధికారులు పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. మండలంలోని సంజీవనగర్ పోలింగ్ బూత్‌ను మోడల్ పోలింగ్ బూత్‌గా, పెంచికల్‌పేట్ పోలింగ్ బూత్‌ను మహిళాల పోలింగ్ బూత్‌గా ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. మండలంలో మొత్తం 12,237 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందులో పురుష ఓటర్లు 6231 మంది, మహిళా ఓటర్లు 6006 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-కౌటాల

శాసనసభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలో 34 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. మండలంలో 26,815 ఓటర్లు ఉండగా అందులో 13,644 పురుషులు, 13,170 మహిళలు, ఒకరు ట్రాన్స్ జెండర్ ఉన్నట్టు ఆయన తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. మండలకేంద్రంలోని 169 పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ స్టేషన్‌గా, 176వ విజయనగరం మహిళా పోలింగ్ స్టేషన్‌లు కొత్తగా ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల విధుల్లో మొత్తం ఏడు రూట్లలో ఏడుగురు రూట్ అధికారులతో పాటు 158 మంది సిబ్బంది పాల్గొననున్నట్టు తెలిపారు.

బెల్లంపల్లిలో ఎన్నికల సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల అధికారులు బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, నెన్నెల, వేమనపల్లి, కన్నెపల్లి, భీమిని మండలాలలోని మొత్తం 227 పోలింగ్ కేంద్రాల సిబ్బందికి బుధవారం ఎన్నికల సామాగ్రిని పంపిణి చేసారు. ఎన్నికల సామాగ్రి పంపిణి కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాధవత్ సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే సమాచారం అందించాలని పేర్కొన్నారు. దింతో ఎన్నికల సిబ్బంది వారి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. కార్యక్రమాన్ని ఎన్నికల అధికారి రాహుల్ నేతృత్వంలో సిబ్బందికి ఎన్నికల విధులను కేటాయించారు.



అయ్యప్ప ఆలయంలో ప్రారంభమైన నిత్యాన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పెద్దవాగు ఒడ్డున గల అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిత్యాన్నదాన కార్యక్రమం జనవరి 14 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పలువురు దాతలు నిత్యా అన్న దానానికి ముందుకు వచ్చారని, ఆసక్తి ఉన్న భక్తులు దీనిని వినియోగించుకోవాలని కోరారు. అయ్యప్ప భక్తులు స్వాములు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు మాలాదారణ చేసి స్వాములు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి చంద్రమోహన్, సభ్యులు మోహన్, బట్టుపల్లి సంతోష్, సతీష్, చిట్టిమల్ల సంతోష్, బాలరాము, దూడల అశోక్, మడావి శ్రీనివాస్, మహేష్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు బయలుదేరిన సిబ్బంది

- **జిల్లాలో 599 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**



ఈవీఎంలను పరిశీలిస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న ఎన్నికలకు బుధవారం జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు ఎన్నికల సిబ్బంది బయలుదేరి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఆసిఫాబాద్ నియోజకవర్గం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారి దాసరి వేణు, జిల్లా విద్యాధికారి అశోక్, శిక్షకులు ఉషన్న పర్యవేక్షణలో సిబ్బందికి అవసరమైన 32 రకాల వస్తువులు, ఎన్నికల సామాగ్రి పంపిణీ చేశారు.

ఉదయం నుండి ప్రారంభమైన ప్రక్రియ

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ ఉదయం 10 గంటల నుండి ప్రారంభమైంది. నియోజకవర్గంలోని 48 సెక్టార్ల గాను సామాగ్రి పంపిణీ కోసం 17 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ముందస్తుగా పంపిణీ ఏర్పాట్లు పకడ్బందీగా చేయడంతో సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సిబ్బందికి ఉదయం టిఫిన్‌తో పాటు భోజనం ఏర్పాట్లు చేశారు. గత ఎన్నికల్లో జరిగిన అనుభవాన్ని పునరావృతం కాకుండా భోజనం ఏర్పాట్లు చేపట్టారు.

జిల్లాలో 599 పోలింగ్ కేంద్రాలు

ఎన్నికలకు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 599 పోలింగ్ కేంద్రాలకు అధికారులను నియమించారు. మొదట 597 ఏర్పాటు చేసినప్పటికీ ప్రజల అవసరం మేరకు 2 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో 305 పోలింగ్ కేంద్రాలు ఆసిఫాబాద్‌లో, 294 పోలింగ్ కేంద్రాలు సిర్పూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేశారు. వీటికి గాను మొత్తం సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు పిఓ, ఎపిఓ, ఓపిఓలు 3492 మంది సిబ్బంది విధులు నిర్వహించనుండగా మరో వంద మంది వరకు రిజర్వ్‌లో ఉంచారు.





ఎన్నికల సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు

- **ఆసిఫాబాద్ ఎస్పీ కె.సురేష్ కుమార్**



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు విధులు నిర్వర్తించే సిబ్బంది సమన్వయంతో పోలీసు సిబ్బంది పనిచేయాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించుటకు ప్రతి ఒక్క పోలీస్ అధికారి సిబ్బంది కృషి చేయాలని అన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఎన్నికల సిబ్బందికి, పారా మిలిటరీ సిబ్బంది సమన్వయంతో జిల్లా పోలీస్ సిబ్బంది పనిచేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు ఉండేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సరిచూసుకోవాలని, ఓటర్లు క్యూలైన్లు పాటించే విధంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. చెక్ పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహించే వారు, ప్రధానంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గల గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, పలు జాగ్రత్తలు సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై నిఘా పెట్టాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని, ఎవరైనా ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడినట్లయితే తక్షణమే సంబంధిత పై అధికారులకు తెలపాలని అన్నారు. ఓటర్లకు భరోసా కలిగించే విధంగా ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, సీఐలు శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.



ప్రమాదవశాత్తు గాయపడిన బాలుడు మృతి

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధి రామారావుపేట్ గ్రామంలో గత ఆరు రోజుల క్రితం వేడి నీటిలో పడి తీవ్రంగా గాయపడిన గడ్డం గౌతం క్రిష్ణ (5) మంగళవారం రాత్రి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గడ్డం హరీష్ హరిత దంపతుల మొదటి సంతానమైన గౌతం క్రిష్ణ తన తమ్ముడు గడ్డం ఆదిత్యతో కలిసి బెడ్‌రూంలో ఆడుకుంటూ బాత్ రూమ్‌లోకి వెళ్లారు. అప్పటికే వేడి చేసి ఉంచిన నీటిలో పడిన గౌతం క్రిష్ణ తీవ్రంగా గాయపడటంతో మంచిర్యాల పట్టణంలో గల సచి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు కరీంనగర్‌లో గల ప్రతిమా ఆసుపత్రికి తరలించగా గౌతం క్రిష్ణ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంచిర్యాల జిల్లాలో గురువారం ఉదయం ఏడు గంటల నుంచి నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుంది. మొత్తం 743 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి నలుగురు అధికారుల విధులు నిర్వహించనున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో 227, బెల్లంపల్లి 227, మంచిర్యాల్ 289 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. చెన్నూర్‌లో 1,88,283, బెల్లంపల్లిలో 1,73,325, మంచిర్యాలలో 2,74,507 మంది ఓటర్లు ఉన్నారు. బుధవారం మంచిర్యాల డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఎన్నికల సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేయగా పోలీసు బలగాలతో అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్ స్లిప్పులు పంపిణీ ఇప్పటికే పూర్తయింది. ఆన్‌లైన్‌లో ఈ స్లిప్పులను అందుబాటులో ఉంచారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. వృద్ధులకు వీల్ చైర్‌లను, వాహనాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటల లోపు కేంద్రంలోకి వచ్చే ప్రతి ఒక్క ఓటరు ఎంత రాత్రి అయినా ఓటు వేసే విధంగా చర్యలు చేపట్టారు. ఎక్కడైనా ఈవీఎంలలో సమస్య వస్తే వెంటనే సరి చేయడానికి పెద్ద ఎత్తున అధికారులని సైతం నియమించారు.

కేంద్ర బలగాల నిఘా నీడలో..

ఈ ఎన్నికల నిర్వహణకు అధికారులు పగడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రచారం ముగిసిన నాటి నుంచే మద్యం నగదు పంపిణీపై ప్రత్యేకంగా నిఘా ఉంచారు. కేంద్ర బలగాలు పహారకాస్తుండగా, వీరికి తోడుగా స్థానిక పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

చెన్నూర్ నియోజకవర్గం..

జైపూర్ : చెన్నూర్ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వాహణకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 28 రూట్లుగా విభజించిన నియోజకవర్గంలో గ్రామ పంచాయతీల పరిధిలో 227 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి సిడెం దత్తు తెలిపారు. బుధవారం సాయంత్రానికి ఎన్నికల సిబ్బంది పోలింగ్ స్టేషన్లకు చేరుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 227 పోలింగ్ కేంద్రాల పరిధిలో 908 మంది సిబ్బంది పోలింగ్ నిర్వాహణలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గం పరిధిలో సంకారం, బుద్దారం ఈ రెండు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా పరిగనించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వాహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలతో పాటు నిర్ణీత సమయంలో పోలింగ్ శాతం పూర్తి చేయడం కోసం సిబ్బందికి ఇప్పటికే దిశానిర్దేషం చేసినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో నియమితులైన అధికారులతో పాటు అదనంగా మరికొందరు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. అదేవిధంగా చెన్నూర్ సమీపంలో గల కిష్టంపేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లు బద్రపర్చుటకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

చెన్నూర్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నిర్వాహణ ఏర్పాట్ల తీరును జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. సమయానుసారం పోలింగ్ పూర్తి చేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎన్నికల నిర్వాహణకు సంబంధించి రామగుండం సీపీ రెమో రాజేశ్వరి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా బందోబస్తు ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు.



నస్పూర్ నుంచి ఎన్నికల సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



జైపూర్ : చెన్నూర్ నుండి విధులకు..



జైపూర్ : ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



నస్పూర్: మంచిర్యాల నుండి విధులకు..



నస్పూర్: విధులకు వెళ్తున్న పోలీసు మహిళా సిబ్బంది

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

- ముందస్తు సమాచారం ఇవ్వని ఆర్టీసీ అధికారులు
- కాగజ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల ఇక్కట్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఆర్టీసీ బస్సులను ఆయా రూట్లలో తరలించడంతో కాగజ్‌నగర్ బస్టాండులో బస్సుల కొరత ఏర్పడింది.ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులను ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఆసిఫాబాద్ డిపో బస్సులు దాదాపుగా ఆయా రూట్లలో ఎన్నికల విధులకు కేటాయించారు. దీంతో కేవలం మంచిర్యాల డిపో బస్సులు మాత్రమే కాగజ్‌నగర్ బస్టాండుకు చేరాయి. సిర్పూర్, కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు లేకపోవడంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి తమ గమ్యస్థానాలకు చేరారు. ఎన్నికల నేపథ్యంలో బస్సులు తరలిస్తామని, బస్సులు నడవవని ముందస్తుగానే ఆర్టీసీ అధికారులు సమాచారం ఇవ్వకపోవడంపై ప్రయాణికులు తీవ్రంగా మండిపడ్డారు. రెండు రోజులపాటూ బస్సులు నడవవని ముందే ప్రకటిస్తే ఇలాంటి ఇబ్బందులు ఉండేవి కాదంటున్నారు. మరో వైపు బస్సుల సమాచారం తెలుసుకునేందుకు కంట్రోలర్ రూంకి వెళ్తే అక్కడ సైతం ఖాళీ కుర్చీ దర్శనం ఇవ్వడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాము సమాచారం ఎలా తెలుసుకోవాలని, బస్సుల రద్దు పట్ల ఎలాంటి ముందస్తు ప్రకటన చేయకపోవడం ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనమని వాపోతున్నారు.



కాగజ్‌నగర్ బస్టాండ్‌లో బస్సులు లేక కిక్కిరిసిన ప్రయాణికులు

జీవన్ ఉత్సవ్ ఎల్ఐసీ పాలసీ ఆవిష్కరణ



నవతెలంగాణ-హజీపూర్

సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆర్థిక అవసరాలకు సరిపోయే "జీవన్ ఉత్సవ్" పాలసీ ద్వారా బీమా రక్షణ పొందాలని మంచిర్యాల ఎల్ఐసీ సంస్థ చీఫ్ మేనేజర్ వి.విశ్వేశ్వర్ పిలుపునిచ్చారు. మంచిర్యాల ఎల్ఐసీ ఆఫీసు ఆవరణలో బుధవారం రోజున జీవన్ ఉత్సవ్ నూతన పాలసీ ఆవిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. గత 67 సంవత్సరాలుగా దేశ ప్రజలకు ఆర్థిక రక్షణ అందిస్తున్న పబ్లిక్ రంగ ఎల్ఐసీ సంస్థ ప్రవేశపెడుతున్న పథకాలతో దేశ ప్రజలకు ఆర్థిక లాభం చేకూరుతుందని ఆయన తెలిపారు. తాజాగా ఎల్ఐసీ ప్రవేశపెట్టిన జీవన్ ఉత్సవ్ పాలసీ గ్యారెంటీడ్ ప్రయోజనాలతో ప్రజలకు పలు విధాలుగా ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా కొత్త పాలసీ ప్రచార ప్రతులను అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ భారతి, పద్మావతి, ఫణి రామ్మోహన్, అనోజ్ కుమార్, రమేష్ బాబు, శివరంజన్, పోచయ్య, గోపికృష్ణ, రాజేశం, రామదాసు, మల్లారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి పోలింగ్‌కు భారీ బందోబస్తు..

- 768 పోలింగ్ కేంద్రాలు
- 80 సమస్యాత్మక కేంద్రాలు
- నిరంతరం పర్యవేక్షిస్తాం
- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



బందోబస్తుపై డీఎస్పీ ఉమేందర్‌తో కలిసి పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజవకర్గాలతో పాటు ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలు కలుపుకొని మొత్తం 768 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయగా వాటిని 85 రూట్లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. 8 కంపెనీల కేంద్ర బీఎస్ఎఫ్ బలగాలు, 550 మంది మహారాష్ట్ర హోంగార్డు సిబ్బంది, జిల్లా సివిల్, సాయుధ పోలీసులు, హోంగార్డు సిబ్బందిని ఆయా కేంద్రాల వద్ద విధులు కేటాయించారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా పెట్రోలింగ్ పార్టీలు, రూట్ మొబైల్స్, క్విక్ రియాక్షన్ టీం, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ టీమ్స్ ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని ప్రణాళిక బద్ధంగా అమలు పరచడానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 80 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ కేంద్ర బలగాలను బందోబస్తుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ సమయంలో రాజకీయ నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ప్రచారం చేపటోద్దని వారిని కేంద్రాల వద్దకు రానివ్వకుండా చూస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మొత్తం దాదాపు 2200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎవరు కూడా గుమిగూడి ఉండొద్దన్నారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తు ప్రజలు సహకరించాలని కోరారు. నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు వారి కోసమే ఉన్నారని తెలిపారు. అదే విధంగా ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా వారి హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు సహకారించాలని కోరారు. ఇదిలా ఉంటే అటూ జిల్లాలోని నియోజకవర్గాల్లో సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక నిఘాతో పాటు పోలీసు బందోబస్తును మరింత పెంచామన్నారు. నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే మండల, గ్రామీణ ప్రాంతాల్లో కవాతు నిర్వహించి పోలీసులున్నామనే భరోసా కల్పించామని తెలిపారు.

ఎలక్షన్ డ్యూటీ.. ఒకేచోట అన్నదమ్ములు



విధి నిర్వహణలో ఇద్దరు అన్నదమ్ములు ఒకే చోట చేరి ముచ్చటిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీ కేంద్రంలో ఈవీఎం మిషన్ల పంపిణీ బుధవారం చేపట్టారు. దీంట్లో భాగంగా ఆయా మండల పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సీఐలు విధులు నిర్వహణలో ఇక్కడికి వచ్చారు. కాగా ఎన్నికల విధుల్లో ఇద్దరు ఎస్సైలు పాల్గొనగా.. వారిద్దరూ అన్నదమ్ములు అవ్వడం విశేషమైంది. మావల పోలీస్ స్టేషన్ ఎస్సై విష్ణువర్ధన్, జైనథ్ ఎస్సై పురుషోత్తం ఇక్కడే విధులు నిర్వర్తించారు. ఎన్నికల విధుల్లో భాగంగా వారిద్దరూ ఒకేచోట కనిపించడంతో కాసేపు ముచ్చటించారు.

పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం: కలెక్టర్



వివరాలు తెలుసుకుంటూ సూచనలు చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం స్థానిక టీటీడీసీ ప్రాంగణంలో ఆదిలాబాద్ నియోజకవర్గ పోలింగ్ సామాగ్రి పంపిణి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. బోథ్ నియోజకవర్గానికి సంబంధించి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణి కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ, ఆర్ఓ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించి పోలింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేయడంతో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు చేయడం జరిగిందని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతిక్షణం అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పర్యవేక్షిస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా సెక్టోరల్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను నియమించడంతో పాటు తమ పరిధిలో పోలింగ్ కోసం కేటాయించిన సిబ్బందిని, సామాగ్రిని అప్పగించడం జరిగిందని తెలిపారు. పోలీసు బందోబస్తు మధ్య రూట్ల వారీగా ఎన్నికల సిబ్బందిని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో పాటు వాహనాలలో పోలింగ్ కేంద్రాలకు చేరవేయడం జరిగిందని తెలిపారు. బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమం పూర్తీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ఖుష్బు గుప్తా, శ్యామల దేవి, ఆర్ఓలు, అధికారులు పాల్గొన్నారు.



ఎస్పీతో బందోబస్తు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఓటర్లను ఆకర్షించేలా ఆదర్శ పోలింగ్ కేంద్రాలు



ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదే లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఆ దిశగా ఓటర్లను ఆకర్షించేలా మోడల్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. గత ఎన్నికల్లో మహిళలకు ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా..ఈ సారి యువత, దివ్యాంగులకు సైతం ఏర్పాటు చేశారు. ఓటర్లను ఆకర్షించేలా ముస్తాబు చేయడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించారు. పండగ వాతావరణాన్ని తలపించేలా అన్ని విభాగాలకు సంబంధించి మోడల్ ఫర్ ఆల్ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా అదిలాబాద్ నియోజకవర్గంలో ఐదు, బోథ్ నియోజకవర్గంలో ఐదు చొప్పున ఏర్పాటు చేశారు.

ఆదర్శ పోలింగ్ కేంద్రాలివే..

ఆదిలాబాద్, బోథ్ నియోజకర్గాల్లోని 592 పోలింగ్ కేంద్రాల్లో ఆదర్శ పోలింగ్ కేంద్రాలుగా పదింటిని ఎంపిక చేశారు. ఇక్కడ ఓటర్లను స్వాగతం పలికేల తోరణాలు, ఇతర సౌకర్యాలు కల్పించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజవకర్గాల్లో ఐదు చొప్పున ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లోని దస్నాపూర్‌లోని ప్రభుత్వ బీసీ బాయ్స్ హాస్టల్, బాలక్ మందిర్‌లోని 7వ తరగతి గది, రూరల్ మండలంలోని చాందా(టి) జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల, కచ్‌కంటిలోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్, పట్టణంలోని సరస్వతి నగర్‌లోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలు ఉన్నాయి. బోథ్‌లో సిరికొండ మండలంలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల, నేరడిగొండలోని జిల్లా పరిషత్ ప్రైమరీ పాఠశాల, గుడిహత్నూర్‌లోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల, తలమడుగు మండలం లక్ష్మీపూర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ పాఠశాల, ఇచ్చోడ మండలంలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌ను ఎంపిక చేసినట్టు అధికారులు తెలిపారు. ఇక్కడ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటెయ్యాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎన్నికల్లోఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటెయ్యాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయి కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పందిరిలొద్ది గ్రామంలో గొండ్వానా యువశక్తి మహంకాళి యూత్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత మత్తు పదార్థాలు, డబ్బులకు తమ ఓటు హక్కును అమ్ముకోవద్దని కోరారు. అనంతరం ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛందంగా ఓటేయ్యాలన్నారు. నాయకుడు నచ్చకపోతే నోటాను ఎంచుకోవాలి సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వృధా చేయకుండా వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో వచ్చి మాయమాటలు చెప్పి ప్రలోభాలకు గురి చేసే వారి నుండి అప్రమత్తంగా ఉండాలని కోరారు. యూత తమ ఓటును అమ్ముకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు పెందూర్ రవీందర్, ఉయిక తుకారాం, సిడాం రాజు, కుమ్ర మంతు, ఏర్మా భీమ్‌రావ్, సెడ్మాకి మహాదేవ్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న యూత్ సభ్యులు